హద్దులు దాటిన తవ్వకాలు

- అటవీ భూములు సైతం ఆక్రమణ
- ఓ స్టోన్ క్రషర్ యాజమాన్యం నిర్వాకం
- పేలుళ్ల ధాటికి పంట పొలాల్లోకి బండరాళ్లు
- లబోదిబోమంటున్న రైతులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

హత్నూర(సంగారెడ్డి): కంది మండలం ఆరుట్ల గ్రామ శివారులో ఉన్న ఓ స్టోన్ క్రషర్ యాజమాన్యం తన మండల సరిహద్దు దాటి హత్నూర మండలం గుండ్ల మాచునూరు గ్రామ శివారులోకి వచ్చి తవ్వకాలు చేపడుతోంది. అలాగే అటవీ ప్రాంతాన్ని ఆక్రమించి అందులో సైతం తవ్వకాలు చేస్తోంది. అంతేకాకుండా భారీ కొండలను పేలుస్తుంది. దీని ధాటికి సమీపంలోని పొలాల్లో పెద్ద బండరాళ్లు పడి సాగుకు పనికిరాకుండా అవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే రాళ్లు ఎగిరిపడుతుండటంతో పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ 20 ఎకరాల వ్యవసాయ భూమి బీడుగా మారిందని చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.


పొలాల్లో పడిన బండ రాయి

చర్యలు శూన్యం

గుండ్ల మాచునూర్ గ్రామ శివారు వద్ద స్టోన్ క్రషర్ పేలుళ్ల విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా అధికారుల్లో చలనం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ యజమానులకు రాజకీయ అండదండలు ఉండటం వల్లే అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని తెలుస్తోంది. ఈ విషయమై సంగారెడ్డి మైనింగ్ ఏడీని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అటవీ భూముల్లో తవ్వకాలు..

క్రషర్ యాజమాన్యం అటవీ భూములను సైతం వదలడం లేదు. అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతూ కోట్లు దండుకుంటుంది. హత్నూర మండలం గుండ్ల మాచనూరు గ్రామ శివారులోని సర్వే నంబర్ 237 గల సుమారు 15 ఎకరాల అటవీ భూమిని కబ్జా చేసి తవ్వకాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల సర్వే చేసిన అటవీ శాఖ అధికారులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కానీ అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

జీవనం భారంగా మారింది



అప్పటి ఎమ్మెల్యే విఠల్ రెడ్డి హయాంలో ప్రభుత్వం భూములు ఇచ్చింది. అందువరి, జొన్న పంటలు పండించాం. ఇక్కడ ఎప్పుడైతే క్రషర్ పెట్టారో భూములు సాగుకు పనికి రాకుండా పోయాయి.

– తూర్పాటి యాదయ్య(రైతు)

ప్రతీ రోజు ఇబ్బందే



స్టోన్ క్రషర్ వద్ద భారీ పేలుళ్లతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. రాత్రి వేళల్లో శబ్దం తాకిడికి పిల్లలు నిద్రలో నుంచి ఉలిక్కి పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదు.

– మచ్చేందర్ గుండ్ల మాచునూరు

విచారిస్తాం



గుండ్లమాచునూరు గ్రామ శివారులోని క్రషర్ మిషన్ వల్ల రైతులు పడుతున్న ఇబ్బందిపై విచారణ జరుపుతాం. క్రషర్ యాజమాన్యం ఏమైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– షేక్ ఫర్వీన్, తహసీల్దార్, హత్నూర

బీసీ కాలనీలో సమస్యల తిష్ట

- కనీస సౌకర్యాలూ కరువే
- ఇబ్బందుల్లో ప్రజలు

జిన్నారం(పటాన్‌చెరు): బీసీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేక ప్రజలు సతమతమవుతున్నారు. మున్సిపాలిటీకి ఆదాయం ఉన్నా గానీ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు అశ్రద్ధ వహిస్తున్నారని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో గల బీసీ కాలనీలో తాగు నీటి సౌకర్యం లేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటి వరకు ఒక రోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ఇక అంగన్‌వాడీ, పీహెచ్‌సీ కేంద్రాలు అందుబాటులో లేవు. కానీ బొల్లారం మున్సిపాలిటీకి ఏటా రూ.12 కోట్లకు ఆదాయం గడిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలను కూడా ప్రకటిస్తుంటుంది. 22 వార్డులున్నా మున్సిపాలిటీలో 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు. అయితే 2వ వార్డులో ఉన్న బీసీ కాలనీ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులు, అధికారులు ఈ కాలనీపై చిన్నచూపు చూస్తున్నారని వాపోతున్నారు.


బీసీ కాలనీ

నిధుల కోసం పోరాడుతున్నాం



మా కాలనీ అభివృద్ధికి అధికారులు, పాలకులు నిధులు కేటాయించటం లేదు. మున్సిపల్ సమావేశంలో నిధులు కేటాయించాలని ఆందోళన చేస్తూనే ఉన్నాం. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి నిధులు కేటాయించాలి.

గోపాలమ్మ, కౌన్సిలర్

ఇబ్బందులు పడుతున్నాం



తాగు నీరు, రోడ్ల సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలు పరిష్కరించటంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు అయినా స్పందించి చర్యలు తీసుకోవాలి.

లక్ష్మి, కాలనీవాసి

చర్యలు తీసుకుంటాం

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. బీసీ కాలనీలో సత్వరమే పర్యటిస్తా. సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతా.

మంగతాయారు, మున్సిపల్ కమిషనర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిందని, ఇవి వెనక్కి వెళ్లకుండా ఆయా పనులను పూర్తి చేయించడానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో బసవేశ్వర ఎత్తిపోతల పథకం, 8 కొత్త చెరువులతో పాటు రహదారులు, రహదారుల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించానన్నారు. కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లల్లో చేయని అభివృద్ధి పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పరశురాం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్, జగదీశ్వరాచారి, సంగప్ప, నగేష్, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు


హుస్నాబాద్ బస్టాండ్‌లో టికెట్ కౌంటర్లను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వరు

- 18 నుంచి 25వ తేదీ వరకు నడపనున్న ఆర్టీసీ
- హుస్నాబాద్‌లో టికెట్ కౌంటర్ల ప్రారంభం

హుస్నాబాద్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుతున్నామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ వేంకటేశ్వర్లు అన్నారు. హుస్నాబాద్ బస్టాండ్‌లో ఆదివారం మేడారం బస్సు టికెట్ కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు డిపో నుంచి మేడారం వరకు 67 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని, మిగతా గ్రామాలకు అదనంగా వచ్చిన మరో 35 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. హుస్నాబాద్ నుంచి మేడారం గ్రామానికి ఫుల్ టికెట్ రూ.350, ఆఫ్ టికెట్ రూ.190 చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఉచిత మెడికల్ క్యాంప్, తాగునీటి సౌకర్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కార్గో ద్వారా భద్రాద్రి శ్రీరాముడి అక్షింతలు నేరుగా ఇంటికి అందించామన్నారు. ఈ మాదిరిగానే జాతరకు వెళ్లలేని భక్తులు తమ ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి, కార్గో ద్వారా రూ.299 చెల్లించి బుక్ చేసుకున్న వారికి నేరుగా ఈనెల 25వ తేదీ తర్వాత ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం అందజేస్తామన్నారు.

సమాజానికి బాలసాహిత్యం అవసరం

బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రస్తుత సమాజానికి బాలసాహిత్యం ఎంతో అవసరమని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. మన బాలసాహిత్యం కార్యక్రమం ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాజేశం మాట్లాడుతూ గతంలో చందమామ, బాలమిత్ర, బుజ్జాయిలాంటి మాసపత్రికల ద్వారా నీతి కథలు సమాజానికి చేరేవన్నారు. ప్రస్తుతం అలాంటి పత్రికలు కనుమరుగైనా పత్రికల్లో పిల్లల శీర్షికలతో కథలు గేయాలు, బొమ్మల రూపంలో అందుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాలలోనూ బాలసాహిత్యం విరివిగా రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పాఠశాల విద్యార్థులు రాస్తున్న బాలసాహిత్య రచనలకు పలు అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా బాలసాహిత్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సిద్దిపేట జిల్లా బాలసాహిత్య రచయితల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాలసాహిత్య రచయితలు బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.


బాలసాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బాలసాహిత్య కవులు

బాలికను మోసం చేసిన కేసులో రిమాండ్

పటాన్‌చెరు టౌన్: బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో నిందితుడిని రిమాండ్ తరలించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరులోని ఓ కాలనీకి చెందిన బాలికకు ఒక సామాజిక మాధ్యమంలో అమీర్‌పేట్‌కు చెందిన నవీన్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో అతడు ఉంటున్న ప్రాంతానికి వెళ్లొచ్చేది. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేశాడు. ఇటీవల గర్భస్రావం చేయించగా బాలిక పరిస్థితి విషమంగా మారడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడి సిబ్బంది ఫిర్యాదు చేయగా డిసెంబర్ 9న కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడిని శనివారం సాయంత్రం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిఏటా మూడు నెలల పాటు ప్రతి ఆదివారం జాతర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం జాతరకు ఉమ్మడి జిల్లా నుండే కాకుండా హైదరాబాదు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటా వార్పు చేపట్టారు. పవిత్ర కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. స్వామివారికి పూజారులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన దుకాణ సమూదాయాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది.

ఘనంగా మల్లన్న జాతర

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం గ్రామంలో ఒగ్గుపూజారులు, గోకుల్ యాదవం సంఘం సభ్యులు గ్రామంలో భిక్షాటన చేయడంతోపాటు గంగ స్నానానికి వెళ్లారు. దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. పోతురాజుల విన్యాసాలు డోలు చప్పుళ్లతో గ్రామ దేవతలకు స్థానిక పెద్దచెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): క్యూలైన్‌లో భక్తులు

బాలికను పెళ్లి చేసుకున్న యువకుడి అరెస్టు

పటాన్‌చెరు టౌన్: బాలికను పెళ్లి చేసుకున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మదీనాగూడలో ఓ కాలనీకి చెందిన బాలిక పటాన్ చెరులో ఓ కాలనీలో ఉంటున్న మేనమామ వద్ద ఉండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఇక్కడే పాన్ దుకాణం నిర్వహించే నాగరాజు బాలికను ప్రేమించాడు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత కుటుంబీకులు వేరే పెళ్లి చేస్తారని భావించాడు. ఈ క్రమంలో ఈనెల 16న బాలికను వెంట తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. ఆమె తండ్రి పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు శోభాయాత్ర

నారాయణఖేడ్: ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19న సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలో శోభాయాత్రను నిర్వహించనున్నట్లు విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ బాధ్యులు తెలిపారు. ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లోని దుర్గాభవానీ మాత ఆలయం నుంచి ఛత్రపతి శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహం వరకు శోభాయాత్ర జరుగుతోందన్నారు.

◆ నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ భాస్కర్ .. లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారని వివరించారు.

◆ పండ్లు, రొట్టెల పంపిణీ

పటాన్‌చెరు టౌన్: అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన సందర్భంగా ఆదివారం జిల్లా అధ్యక్షుడు కే నర్సింహరెడ్డి, నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. దేశంలో 3 కోట్ల 30 లక్షల సభ్యత్వం కలిగిన ఏకైక యూనియన్ తమదేనన్నారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పాటుబడుతున్న ఏకైక వ్యక్తి సంజీవరెడ్డేనని అన్నారు. నాయకులు చంద్రమౌళి, నాగరాజు గౌడ్, రాజశేఖర్ రెడ్డి, బోజ రాజు, రతన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు సామయ్య, హమీద్ కుంచల కిషన్, రాజు పాల్గొన్నారు.

◆ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



నారాయణఖేడ్: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఆదివారం జగద్గురు స్వామి నరేంద్రాచార్య సంస్థానం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాంతో సహా 46 మంది రక్తదానం చేశారు. స్వామి నరేంద్రాచార్య భక్తులు పాల్గొన్నారు.

◆ నగర సంకీర్తనకు స్పందన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాం నగర్ కాలనీలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. హరే కృష్ణ హరే రామ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భజన చేస్తూ కీర్తనలు ఆలపిస్తూ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు.

◆ దర్గాను దర్శించుకున్న బీరయ్య యాదవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ సమీపంలో గల షరీఫ్ పీర్ సాహెబ్ దర్గాను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట నాయకులు శివరాజ్, కుత్బోద్దీన్, రహీమ్ తదితరులు ఉన్నారు.

◆ కార్యాలయం ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో భవన నిర్మాణ కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్యాలయాన్ని ఆదివారం రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్‌తో కలిసి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, పలువురు నాయకులు, భావన నిర్మాణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ సాయినగర్ కాలనీలో బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీలో ఆదివారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ పుష్ప నగేష్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, రాజ్ కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

నారాయణఖేడ్: రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడలో దళితులపై దాడులకు పాల్పడ్డ వారిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టుల ప్రకారం కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్‌లోని సంఘ కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి విషయంలో కొందరు వ్యక్తులు పథకం ప్రకారం అగ్గి రాజేసి ఒక వర్గం వారిని దళితులపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దళితులకు రక్షణ కల్పించాలన్నారు. నాయకులు గౌతం, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరండి


మాట్లాడుతున్న మల్లికార్జున్ పాటిల్

నారాయణఖేడ్: మరోసారి మోదీని ప్రధానిగా చేయడమే లక్ష్యంగా బీజేపీ చేపడుతున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్ కోరారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న బస్సు యాత్ర మనూరులోకి ప్రవేశిస్తోందన్నారు. ఖేడ్ ప్రధాన చౌరస్తాలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. పార్టీ శ్రేణులు విజయవంతానికి కృషిచేయాలన్నారు. ఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిరాం, మండలాల పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు బస్వరాజ్, ఆంజనేయ, రాజశేఖర్ గౌడ్, దశరథ్, రాజశేఖర్ పాటిల్, ఈశ్వరప్ప, గోపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కృష్ణ, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజయ్యకు సన్మానం


రాజయ్యకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సురేష్

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన సిరిసిల్ల మాజీ ఎంపీ రాజయ్యను సన్మానించారు. ఆదివారం పట్టణానికి చెందిన జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ హైదరాబాద్‌లో శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సాయిబాబా పాద స్పర్శ దర్శనం


బాబా పాద స్పర్శ దర్శనం చేసుకుంటున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో గల షిర్డీసాయి బాబా మందిరం 22వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు బాబా పాద స్పర్శ దర్శనం కల్పించారు. బాబా జీవిత చరిత్ర అఖండ సామూహిక పారాయణం పఠించారు. సామూహిక సాయి సత్యవ్రతాలు కూడా నిర్వహించారు. తొలుత భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ తరహాలో మహాహారతి ఇచ్చారు. పల్లకీలో బాబాను ఊరేగించారు. స్పర్శ దర్శనం ఏడాదికి ఒకటి, రెండు సార్లు మాత్రమే ఈ అవకాశం లభిస్తుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

జోగిపేట(అందోల్): మండలకేంద్రానికి చెందిన బైండ్ల జ్యోత్స్న, ఎండీ జమాల్‌లు కరాటేలో బంగారు పతకాలు సాధించినట్లు మాస్టర్ అశోక్ తెలిపారు. రుద్రమదేవి షోటోకాన్ కరాటే డో-సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్.. విజయ భాస్కరరెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన నాల్గో నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్-2024 పోటీల్లో 50 మంది పాల్గొన్నారని, 10 మంది బంగారు పతకాలు, 10 మంది సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. అందులో వీరిద్దరూ బంగారు పతకాలు సాధించారన్నారు. పలువురు వారిని అభినందించారు.